



పంటల రుణ పరిమితి పెంపు

- వరి, మొక్కజొన్న పత్తికి రూ.2వేలు అదనం
- జిల్లాలో 2,48,550 మంది రైతులు

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈయేడాది పంటల రుణ పరిమితిని ప్రభుత్వం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ) సిఫార్సుల మేరకు ఈ పెంపు ఉంటుంది. ప్రధానంగా రైతులకు ఏటాసాగులో పెట్టుబడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రుణ పరిమితి పెంపు ద్వారా అన్నదాతకు బ్యాంకుల నుంచి లభించే రుణం పెరగనుంది. వరి, మొక్కజొన్న, పత్తి రైతులకు రూ.2 వేలు అదనంగా రుణం మంజూరు కానుంది. జిల్లాలో ఈయేడాది సుమారు 4.15లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవ సాయశాఖ అంచనా వేసింది. జిల్లాలో 2,48,550 మంది రైతులు ఉన్నారు. ఇందులో 2.5ఎకరాల్లోపు 1,79,826 మంది రైతులు, 2.5నుంచి 5 ఎకరాల్లోపు 52,692 మంది రైతులు, 5ఎకరాల పైన 16,032 మంది రైతులున్నారు.

● జిల్లాలో వానాకాలం సాగు అంచనా ఇలా..

జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 4,15,169 ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందు లో ప్రధానంగా వరి 3,10,642 ఎకరాలు, మొక్కజొన్న 32వేల ఎకరాలు, కందులు 1,500 ఎకరాలు, పత్తి 18వేల ఎకరాలు, చెరుకు 500 ఎకరాలు, పసుపు 8,500ఎకరాలు, మిరప 500 ఎకరాలు, మామిడి 38,277 ఎకరాలు, వివిధ కూరగాయలు 400ఎకరాలు, ఆయిల్ ఫామ్ 3,750ఎకరాల్లో సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

● వరి, మొక్కజొన్న, పత్తి రైతులకు మేలు..

జిల్లాలో అత్యధికంగా సాగయ్యే వరి, మొక్కజొన్న, పత్తికి సంబంధించి పంట రుణ పరిమితి పెంచడం ద్వారా రైతులకు మేలు చేకూరనుంది. ఎకరానికి నిర్ధారిత మొత్తం బ్యాంకర్లు రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా సాగులో వారికి పెట్టుబడికి ఉపయుక్తంగా ఉంటుంది. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు రుణ పరిమితిని రూ.2 వేల వరకు పెంచారు.

● బ్యాంకులు ఆదరించేలా..

ఈ యేడాది రెండు లక్షలకు పైగా రైతులకు రుణాలు అందజేయాలని బ్యాంకర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్నదాతలకు విరివిగా రుణాలు అందించాలని...

మిగతా 8లో

పంటల వారీగా రుణ పరిమితి

పంట	ప్రస్తుత రుణ పరిమితి	పెంచిన రుణ పరిమితి
పత్తి	46 వేలు	48 వేలు
సోయా	30 వేలు	30 వేలు
మినుము	21 వేలు	22 వేలు
పెసర్లు	18 వేలు	19 వేలు
శనగ	26 వేలు	27 వేలు
జొన్న	20 వేలు	21 వేలు
వరి	34 వేలు	36 వేలు
మొక్కజొన్న	34 వేలు	36 వేలు
కందులు	21 వేలు	22 వేలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి ఫీడర్ వద్ద సోమవారం చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా మల్యాల సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల గ్రామ పరిధిలో వ్యవసాయ బావులకు ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

బీర్‌పూర్ ఎస్సైగా రాజు

బీర్‌పూర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ ఎస్సైగా రాజు ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు విధులు నిర్వహించిన కుమారస్వామి బదిలీపై వెళ్లగా కొన్ని రోజుల క్రితం బీర్‌పూర్‌లో ట్రైనింగ్ ఎస్సైగా విధులు నిర్వహించిన రాజును బీర్‌పూర్ ఎస్సైగా నియమించడంతో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



జగిత్యాలలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాల క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాలలో ఆదివారం మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. టవర్ ప్రాంతంలో కొలువుదీరిన పీర్లను చివరి రోజు భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. పట్టణంలో మార్కెట్ రోడ్, టవర్ నలుమూలల భక్తులతో కిటకిటలాడింది. యువకులు పులి వేషాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో పాటు నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీర్లను టవర్, తీన్‌ఖని, మంచినీళ్ల బావి చౌరస్తాల మీదుగా ఊరేగింపు నిర్వహించి చింతకుంట చెరువులో నిమజ్జనం చేశారు.

●**ధర్మపురి:** ధర్మపురి మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం, సారుగమ్మవీధి, రహమత్ పుర వీధుల్లోని ఆషూర్‌ఖానాల్లో నెలకొల్పిన పీరీలను గోదావరి నది వరకు ఊరేగింపు జరిపారు. అనంతరం న దిలో నిమజ్జనం చేశారు. వేడుకలను ఆయా ఆషూర్‌ఖానాల ముజావర్లు సర్ధాజ్‌హుస్సేన్, షేక్ హఫీజ్‌అలీ, షేక్ మహమూద్‌అలీ మహ్మద్ హుస్సేన్, మహ్మద్ ఆదిల్ నేతృత్వంలో రాత్రి వరకు ఘనంగా నిర్వహించారు. ఉర్దూ అకాడమీ బోర్డు మాజీ డైరెక్టర్ అన్వర్‌ఖాన్ సహకారం అందించారు. రాత్రి వేళలో గోదావరి నది వద్ద ప్రజలకు సొంగ రొట్టెలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

●**కొడిమ్యాల:** మండలంలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొడిమ్యాలలోని ప్రధాన వీధులలో పులి వేషాలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పలువురు పీరీలకు దస్తీలను కట్టి మొక్కులను తీర్చుకున్నారు. మొక్కులున్న వారు పులి, సింహాల వేషాలను వేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.



ధర్మపురిలో పీరీల ఊరేగింపు

మత్స్యకారులకు ఆర్థిక సహాయం అందించాలి

● మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు చేప పిల్లల స్థానంలో నగదు అందించాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. చేప పిల్లల పంపిణీ టెండర్ ప్రక్రియ ద్వారా చేపడుతుండగా చేప పిల్లలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకు వచ్చి కాంట్రాక్టర్‌లు చెరువులో కుంటలలో పోస్తున్నారన్నారు. చేప పిల్లలకు బదులు నగదు అందిస్తే మత్స్యకారులు సకాలంలో చేప పిల్లలను చెరువులలో వేయడంతో ఎక్కువ లాభాలు గడించే అవకాశం ఉన్నదని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

గోరింటాకు వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

రాయికల్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో ఆదివారం దుర్గాభవానీ కిట్టీపార్టీ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టీ పార్టీలోని మహిలు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు.

చివరి మజిలీకి తప్పని తిప్పలు

● శ్మశాన వాటికలో కరువైన కనీస వసతులు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మెట్‌పల్లిటౌన్, జూలై6 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో శ్మశాన వాటికలో కనీస వసతులు కరువవడంలో చివరి మజిలీకి తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే వారి బంధువులు శ్మశాన వాటికకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బోయవాడలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శ్మశాన వాటికకు పట్టణంలోని 14, 1, 23 వార్డుల్లోని బోయవాడ, శివాజీనగర్, బాలకిషన్ నగర్, దుబ్బవాడ, బంటుపేట, గంగపుత్ర వార్డులకు చెందిన 9 కుల సంఘాల ప్రజలు సొంత నిధులతో కొన్ని సంవత్సరాల క్రితం ఈ శ్మశాన వాటికను ఏర్పాటు చేసుకున్నారు. గతంలో పలుమార్లు సమస్యలపై అధికారులకు, ప్రజప్రతినిధుల దృష్టికి తీసుకుపోవడంతో నిధులు మంజూరు చేయడంతో కొన్ని పనులు పూర్తి చేశారు. కానీ నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● నిరుపయోగంగా వాటర్‌ట్యాంక్

అంత్యక్రియల అనంతరం హిందూ సంప్రదాయం ప్రకారం చేయాల్సిన కార్యక్రమాలు చేద్దామంటే కనీస సౌకర్యాలు కరువయ్యాయి. స్నానాలు చేయడానికి నీరు లేకపోవడంతో ఉన్న వాటర్‌ట్యాంక్, స్నానపు తొట్టి నిరుపయోగంగా ఉన్నాయి. కర్మకాండలతో పాటు తదితర కార్యక్రమాలు జరిపేందుకు ఎలాంటి వసతులు లేకపోవడంతో రోడ్డుపైనే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళలో కర్మలు చేయాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం రహదారి సరిగా లేకపోవడంతో బురదమయంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సౌకర్యంతో పాటు విద్యుత్, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



శ్మశానవాటికలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

సౌకర్యాలు కల్పించాలి..



బోయవాడలోని హిందు శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు లేక 14వ వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో రహదారి పూర్తిగా బురదమయంగా తయారై అడుగుతీసి అడుగు వేయాలంటే కష్టం అవుతోంది. శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కల్పించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

-దొనికెల నవీన్, బీజేవైఎం నేత

ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం

బోయవాడలోని శ్మశాన వాటికను కొన్ని కులాలకు చెందిన వారు సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. శ్మశాన వాటికకు వెళ్లే రహదారి వెంట ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతాం.

-మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

నలుగురు ఎస్సైల బదిలీ

జగిత్యాల క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రైనింగ్‌లో ఉన్న రవీందర్‌ను ధర్మపురి-2 ఎస్సైగా, రాజును బీర్‌పూర్ ఎస్సైగా, సుప్రియను సీసీఎస్‌కు బదిలీ చేశారు. బీర్‌పూర్ ఎస్సైగా పని చేస్తున్న కుమార స్వామిని ఎస్బీకి బదిలీ చేశారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవిందర్



కోరుట్ల కమిషనర్ రవిందర్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

కోరుట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవిందర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని వివిధ వార్డుల్లో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. రోడ్డుపై పడిన గుంతలను భవన నిర్మాణాల నుంచి వచ్చే వ్యర్థాలతో నింపాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, అశోక్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి'



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భీమారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షుడు బంగారు దీపక్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో ఆదివారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భీమారం సొసైటీ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుధవేణి భూమేష్ గౌడ్, రంగాపూర్ గంగాధర్, కాటిపెల్లి మహేష్, కానుగంటి శ్రీనివాస్, సాకలి నర్సయ్య, ఎర్ర పెద్ద అంజయ్య, కంచి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

●**మల్యాల, జూలై 6(ఆంధ్రజ్యోతి):** బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నలువాల సంజీవ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, మారంపల్లి గంగాధర్, సైదల అంజయ్య, తడగొండ శ్రీనివాస్, మిల్కీ శ్రీనివాస్, కొంక నర్సయ్య, బీవీ రమణ పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న బీడీ కార్మిక సంఘ నాయకుడు భూమేశ్వర్

కోరుట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను బీడీ కార్మిక సంఘాలు విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు చింత భూమేశ్వర్ కోరారు. ఆదివారం పట్టణంలో యూనియన్ కార్యాలయంలో ఏర్పాట చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ధార్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు గంగాధర్, రహీం, ఖలీం పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాలు

రాయికల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గురు పూజోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా రాయికల్ పట్టణంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ సంఘ్ కరీంనగర్ విభాగ్ సహ కార్యవాహ్ రంగస్వామిజీ, రామాజీపేట, భూపతిపూర్‌లో జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ వేముల రాంరెడ్డి జీ, మహితాపూర్‌లో జిల్లా సహ కార్యవాహ్ అయి మధుకర్‌జీ, చెర్లకొండాపూర్, మూటపెల్లిలో ఖండ కార్యవాహ్ వేల్పుల స్వామి యాదవ్‌లు సమాజంలో గురువుల పాత్ర గురించి వివరించారు. సనాతన ధర్మంలో గురువుకు మహోన్నత స్థానం ఉందని ఆర్ఎస్ఎస్ వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో తురగ రాజిరెడ్డి, రాంగోపాల్, తిరుపతి రావు, వేణు రావు, బొడ్డం మోహన్ జీ, జితేందర్ రెడ్డి, తోపారపు రవీందర్, వీరబత్తిని శంకర్, మామిడాల లక్ష్మీనారాయణ, గన్నవరం గంగాధర్, అశోక్‌జీ, పందిరి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

● కిటకిటలాడిన ఆలయాలు ● భక్తుల ప్రత్యేక పూజలు 8



కోరుట్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చిన్నారి హత్య కేసులో

వీడుతున్న మిస్టరీ

- చిన్నమ్మపైనే అనుమానం
- పోలీసుల అదుపులో అనుమానితురాలు

6

ఇళ్ల పట్టాలు ఇచ్చేదెన్నడో..?

- నాలుగేళ్లుగా ఎదురుచూపులు
- ప్రభుత్వం స్పందించాలంటున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

6

యాదవులందరినీ ఐక్యం చేస్తాం

రాయికల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): యాదవులందరినీ ఐక్యం చేసి ముందుకు వెళ్తామని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మండలంలోని భూపతిపూర్ యాదవ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు మ్యాదరవేని రామాంజనేయులు యాదవ్, పంచతి శంకర్ యాదవ్‌లతో కలిసి పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు 86మంది సభ్యత్వం తీసుకోగా వారిని ఇన్‌చార్జిలతో కలిసి సభ్యత్వ రశీదులు అందించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు చిన్న మల్లయ్య, బొడ్డు చిన్న మల్లేశం, మంత్రి కొమురయ్య, మంత్రి పోచమల్లయ్య, గోనె రాములు, నేతుల లక్ష్మీనారాయణ, ధనరేకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభ్యత్వ రశీదులు అందజేస్తున్న యాదవసంఘం నాయకులు

ఆర్మీ జవాన్‌కు సన్మానం

మెట్‌పల్లిటౌన్, జూలై6(ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఆర్మీ జవాన్ బొర్రోల్ల రాజేష్‌ను మోచి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దేశరక్షణలో భాగంగా ఆర్మీలోచేరి 17 సంవత్సరాలు విధులు నిర్వర్తించి నాసిక్‌లో పదవి విరమణ పొంది సేడు స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా మెట్‌పల్లి మోచి సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బైరీ రాజేశ్వర్, నాయకులు భూమయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోత్కపల్లి యూనియన్ బ్యాంక్ వద్ద ఆదివారం రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో గుంపులకు చెందిన ఆరేపల్లి జశ్వంత్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోత్కపల్లి నుంచి ద్విచక్రవాహనంపై గుంపుల వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో జశ్వంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. దీంతో క్షతగాత్రుడిని జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.

పొరండ్లలో ఆర్ఎంపీ క్లినిక్ తనిఖీ

తిమ్మాపూర్ (మానకొండూర్), జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామంలో గల ఆర్ఎంపీ వైద్య క్లీనిక్‌ను టీజీఎంసీ సభ్యుడు యగ్గన్న శ్రీనివాస్ ఆదివారం తనిఖీ నిర్వహించారు. రోగులకు యాంటీబయాటిక్ ఇంజక్షన్‌లు, స్టెరాయిడ్, ఇంజక్షన్‌లు పేయిన్ కిల్లర్ ఇంజక్షన్‌లు ఇస్తున్నట్లు తనిఖీలో గుర్తించారు. దీనికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులో ఫార్మసిస్ట్ లేకుండా ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పేకాట రాయుళ్లపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వారి వద్ద 9,320 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని, పోలీస్ స్టేషన్‌కు తరలించి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.


చొప్పదండిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పిలుస్తోంది..

- అధునాతన భవనం..
- ఆధునిక వసతులు
- 400 మంది విద్యార్థులకు అవకాశం

చొప్పదండి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులను పిలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో సహా ఓసీ వర్గాలకు చెందిన మూడో తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ హాస్టల్‌లో ప్రవేశం కల్పిస్తారు. 400 మంది విద్యార్థుల కోసం అధునాతనమైన భవనాన్ని ఐదేళ్ల క్రితం నిర్మించగా, విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పట్టణం నడిఒడ్డున ఉండి అందరికి అందుబాటులో ఉంది. ప్రస్తుతం హాస్టల్‌లో 200 మంది విద్యార్థులు ఉండగా మరో 200 ఖాళీలు ఉన్నాయి.



యోగా చేస్తున్న విద్యార్థులు


భోజనశాలలో విద్యార్థులు

● విద్యార్థులకు పోషకాహారం...

హాస్టల్‌లో విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. వారానికి రెండుసార్లు చికెన్, రోజు ఎగ్‌తోపాటు అరటిపండు, ఉదయం రాగిజావను అందిస్తున్నారు. ఉదయం అల్పాహారంలో పూరి, ఇడ్లీ, ఉప్మా, పొంగలి, కిచిడిని ఇస్తున్నారు. సాయంత్రం స్నాక్స్ అందిస్తుండగా, విద్యార్థులకు స్వెటర్లు, దుప్పట్లు, బ్యాంకెట్లను అందిస్తున్నారు. స్నానానికి వేడినీటి సౌకర్య ఉండగా, తాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను హాస్టల్‌లో నెలకొల్పారు. హాస్టల్ ఆవరణలో విద్యార్థులకు క్రీడా మైదానం ఉండగా ప్రతిరోజు వ్యాయాయం చేయిస్తుంటారు. ఇద్దరు వార్డెన్లతోసహా ఒక అధికారి పర్యవేక్షణలో ఈ హాస్టల్ నడుస్తోంది.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి...
- సత్యనారాయణ, హాస్టల్ వార్డెన్



తమ హాస్టల్‌లో అన్ని వసతులను విద్యార్థులకు కల్పిస్తున్నాం. విద్యార్థులు హాస్టల్‌లో చేరి ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. వదశాతం ఉత్తీర్ణత శాతం సాధించేందుకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


పోషయ్య(ఫైల్)

వీర్నపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించలేక, అనారోగ్యంతో ఉన్న కూతురికి వైద్యం చేయించలేక ఉరేసుకొని ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి పోషయ్య (60) కూలీ పనితోపాటు కొంత తనకున్న ఎకరంన్నర భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురు తిరుమల(25) చిన్నతనం నుంచి షుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పులయ్యాయి.

కూతురు ఆరోగ్యం కుదుటపడకపోవడం, ఆసుపత్రుల్లో చూపించేందుకు డబ్బుల్లేక తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రాజవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనారోగ్యంతో ఉన్న బిడ్డ కన్నీరు పెడుతూ తండ్రి చితికి నిప్పు పెట్టడం పలువురిని కలిచివేసింది.

పురుగుల మందు తాగి యువకుడు..

ముత్తారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడివిశ్రీరాంపూర్‌కు చెందిన చొప్పరి సదానందం (35) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సదానందం తాగుడుకు బానిసై ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. శనివారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో భార్య చొప్పరి భారతితోపాటు కుటుంబసభ్యులు గ్రామంలో వెతుకగా ఊర చెరువు దగ్గర తాగిన మత్తులో పురుగుల మందు కిందపడిపోయి ఉన్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు సదానందం భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో తాటిచెట్టు పైనుంచి పడి వెంగలి శంకరయ్య అనే గీతకార్మికుడికి ఆదివారం గాయాలయ్యాయి. వెంగలి శంకరయ్య కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కుతుండగా మోకుజారి కింద పడిపోయాడు. కార్మికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని గీత కార్మికుడి దుర్మరణం


ఐలు మల్లేష్ (ఫైల్)

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఐలు మల్లేష్ (36) అనే గీత కార్మికుడు బెల్లంపల్లిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఓదెలకు చెందిన మల్లేష్ మూడు సంవత్సరాల క్రితం బెల్లంపల్లి మండలం కాసిపల్లికి గౌడ వృత్తి చేసేందుకు వలస వెళ్లాడు. శనివారం రాత్రి బెల్లంపల్లిలో మిత్రుడి శుభకార్యానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతుడికి భార్య రాధిక, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మల్లేష్ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మల్లేశం నేత్రాలను సదాశయ ఫౌండేషన్ సేకరించారు. ఓదెలలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

పొలానికి దారి కోసం గొడవ

- ఒకరిపై దాడి..తీవ్రగాయాలు
- చికిత్స కోసం ఆసుపత్రికి తరలింపు

కథలాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పొలానికి దారి కోసం జరిగిన గొడవలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం కథలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం... తిక్క మల్లేశ్ అనే రైతుకు పక్కనే ఉన్న తిక్క రాహుల్‌కు కొంతకాలంగా దారి కోసం గొడవ జరుగుతోంది. మల్లేశ్ ట్రాక్టర్‌పై వెళ్లి దున్ని ఇంటికి వస్తున్న క్రమంలో రాహుల్, ఆదిత్య పారతో కొట్టగా తీవ్రగాయాలయ్యాయి. తలనుంచి రక్తస్రావం కావడంతో మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కోరుట్లకు పంపించారు. దాడికి పాల్పడ్డ రాహుల్, ఆదిత్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. నిందితులు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూరు గ్రామ శివారులో ప్రధాన రహదారి వద్దగల వైన్స్ సమీపంలో కామారెడ్డి వైపు వెళుతున్న టిఎస్03ఇజె1008 అనే కారు సిరిసిల్ల వైపు వస్తున్న ద్విచక్రవాహన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సిరిసిల్ల పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బరిగెల అరుణ్‌కుమార్(29), నెహ్రూనగర్‌కు చెందిన తడుక సాయిచరణ్ (27)లకు తీవ్రగాయాలయ్యాయి. బరిగెల అరుణ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి టౌన్ సీఐ కృష్ణ వెళ్లి రహదారిపై ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ: ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న కొడిమ్యాల మండలంలోని తురుకకాశీనగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని సండ్రల్లపల్లి గ్రామానికి చెందిన బుచ్చిబాబు అతనికి వరుసకు కుమారుడైన చంద్రగిరికి చెందిన జూపాక మారుతి వర్షిత్ నమిలికొండ నుంచి గంగాధరకు పనినిమిత్తం స్కూటీపై వెల్లుతుండగా లారీ ఢీకొట్టగా ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గాయాలాపాలైన ఇద్దరిని 108వాహనంలో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు సునీల్ విశ్వకర్మ(31) శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సునీల్ విశ్వకర్మ చైతన్యపురి కాలనీలో ఒక భవనం నిర్మాణ పనుల్లో స్లాబ్ కోసం ఇనుక సలాకలను మిషన్‌తో కట్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపోయి సునీల్ ప్రమాదానికి గురయ్యాడు. అక్కడే ఉన్న ఇంటి యజమాని, తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. సునీల్ విశ్వకర్మ భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

ధర్మపురి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం మధ్యాహ్నం వెహికల్ తనఖీ చేస్తున్న సమయంలో ఒక పికప్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకొన్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం వేళలో వాహనాన్ని తనఖీ చేశామన్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి వాహనంలోని ఎనిమిది ఆవులు, రెండు లేగ దూడలను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారి హత్య కేసులో వీడుతున్న మిస్టరీ

- చిన్నమ్మపైనే అనుమానం
- పోలీసుల అదుపులో అనుమానితురాలు


చిన్నారి మృతదేహంపై పడి విలపిస్తున్న తండ్రి రామ్, ఇన్‌సెట్‌లో హితీక్ష (ఫైల్)

కోరుట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లో శనివారం జరిగిన హితీక్ష(5) అనే చిన్నారి హత్య కేసు మిస్టరీ వీడుతోంది. ఈ కేసులో పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. పోలీసులు విచారణ చేపట్టి ఆమె చిన్నమ్మ మమత పైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి హితీక్ష మమతకు తోటి కోడలు కూతురు. హత్య జరిగిన వెంటనే ఎస్పీ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మొదట హితీక్ష మృతదేహం దొరికిన ఇంటి యజమాని విజయ్ వివరాలను సేకరించగా అతడు వరంగల్ జిల్లాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విజయ్‌ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టిన పోలీసులు ఆదివారం విడిచి పెట్టారు. సంఘటనా స్థలం దగ్గర పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా అవి హితీక్ష ఇంటిలోకి వెళ్లి నిలిచి పోవడంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు. ఇంట్లో ఉన్నవారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇంట్లోకు వచ్చి పోయేవారి వివరాలతో పాటు హితీక్ష చిన్నమ్మ మమత ఫోన్ డేటాను పరిశీలించారు.

● వివాదాస్పదంగా మమత వ్యవహారం

మమత సెల్‌ఫోన్‌లో హత్య చేయడానికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్పింగులను గుర్తించి న పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు. తొలుత మమత ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కొద్దిసేపటి అనంతరం తిరిగి అందించారు. మరికాసేపటికి మమత ఫోన్‌ను తీసుకొని తనిఖీ చేయగా అందులో మమత డౌన్‌లోడ్ చేసిన వీడియోలు లేకపోవడంతో ఆమెపై అనుమానం వ్యక్తం చేసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్య జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా మమత సాయంత్రం 6:30 గంటల నుంచి మృతదేహం దొరికే వరకు ఐదుసార్లు అదే ప్రాంతానికి వచ్చిపోయినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన సమయంలో మమత వేసుకున్న లెగ్గిన్, హితీక్షను ఆసుప్రతికి తీసుకువచ్చిన సమయంలో ధరించిన లెగ్గిన్ వేరుగా ఉండడంతో పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. హితీక్ష కోసం బంధువులు వెతుకుతున్న సమయంలో మమత పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వైపు వెళ్లి వచ్చినట్లుగా తెలుస్తోంది. చిన్నారి హత్య కోసం వాడిన పరికరాలతో పాటు మమత వేసుకున్న లెగ్గిన్‌ను పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద పడేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఈ కేసులో మమతతో పాటు ఎవరైనా ఉన్నారా అన్న విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

● ఆన్‌లైన్ బెట్టింగుల్లో రూ.25లక్షల నష్టం

పట్టణంలోని ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన ఆకుల మదన్-లక్ష్మి దంపతులకు రామ్, లక్ష్మణ్ అనే ఇద్దరు కవల కుమారులు, ఓ కూతురు ఉంది. మదన్ తన ఇద్దరు కుమారులు రామ్, లక్ష్మణ్‌లకు ఎనిమిది సంవత్సరాల క్రితం నవీన, మమతలతో ఒకే వేదికపై వివాహం జరిపారు. రామ్, లక్ష్మణ్‌లు తండ్రి మదన్‌తో కలిసి గల్ఫ్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లి వస్తుంటారు. రామ్-నవీన దంపతులకు కుమారుడు వేదాక్ష్, కూతురు హితీక్ష ఉన్నారు. లక్ష్మణ్-మమత దంపతులకు శ్రీహశ్రీ, మహనీయ అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రామ్, లక్ష్మణ్, తండ్రి మదన్ గల్ఫ్ దేశానికి వెళ్లగా నవీన, మమత వారి అత్త లక్ష్మితో కలిసి ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన మమత కోరుట్లలోని కంప్యూటర్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తోంది. మమత ఆన్‌లైన్ బెట్టింగులతో పాటు బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెట్టి 25 లక్షల రూపాయలు నష్టపోయినట్లు తెలిసింది. డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారని మమత తన తోటి కోడలు నవీనపై కక్ష పెంచుకొని ఆమె కూతురు హితీక్షను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

గల్ఫ్ నుంచి వచ్చిన చిన్నారి తండ్రి

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): కూతురు హత్యకు గురైన విషయం తెలుసుకున్న హితీక్ష తండ్రి రామ్, తాత మదన్ గల్ఫ్ దేశ నుంచి ఆదివారం కోరుట్ల పట్టణానికి చేరుకున్నారు. హితీక్ష మృతదేహంపై పడి తల్లిదండ్రులు రామ్-నవీన రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం హితీక్ష అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేష్ బాబు, అనిల్ కుమార్, ఎస్ఐలు చిరంజీవి, కిరణ్ కుమార్, నవీన్, శ్యాంరాజు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

కేసు రాజీ చేసుకోవాలని బెదిరింపులు

-ఒకరి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేసిన రాములు

ధర్మారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయం లో రాజీ చేసుకోవా లని పెద్ద మనుషులతో పాటు ఎస్ఐ బెదిరింపు లకు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండ లం నందిమేడారం గ్రామానికి చెందిన కొండ రాములు గౌడ్ (50) కుమారుడు కొండ సాగర్ ఓ ప్రేమ వ్యవహారంలో నాలుగు సంవత్సరాల క్రితం హత్యకు గురయ్యాడు. దానికి సంబంధించిన కేసు పెద్దపల్లి జిల్లా కోర్టులో ఉండగా ఇటీవల ట్రయల్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలో హత్యకు గురైన వ్యకి కుటుంబ సభ్యులను కేసును రాజీ చేసుకోవాలని గ్రామానికి చెందిన ముగ్గురు పెద్ద మనుషులు ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో కొండ రాములు గౌడ్ ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పెద్ద మనుషులకే వత్తాసుపలికి రాములు పైనే కేసు పెడతానని బెదిరించాడని రాములుగౌడ్ కుమారుడు హరీష్ చెప్పాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రాములు గౌడ్ డయల్ 100కు ఫోన్ చేసి ఎస్ఐ కేసు పెడుతానని బెదిరిస్తున్నాడని, తాను పురుగుల మందు తాగుతున్నానని చెప్పి పురుగుల మందు తాగాడు. సమాచారం అందుకున్న పోలీసులు కొండ రాములు ఇంటికి వెళ్లి కొడుకు హరీష్ సహాయంతో ఘటన స్థలానికి చేరుకొని రాములును చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● రూ.22 లక్షలే

ఆత్మహత్యాయత్నానికి కారణమా?

కేసు రాజీ చేసుకోవాలని పెద్ద మనుషుల సమక్షంలో 22 లక్షల రూపాయలకు ఒప్పందం చేసుకొన్న కొండ రాములు అకౌంట్లో డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్ రాసుకున్నట్లు తెలిసింది. కేసు ట్రయల్‌కు వస్తున్న నేపథ్యంలో కొండ రాములు రాజీకి ఒప్పుకోవడం లేదని, 22 లక్షల రూపాయలు తిరిగి ఇవ్వాలని పెద్దమనుషులు ఒత్తిడి తెచ్చినట్లు తెలుసింది. ఈ విషయమై ఎస్ఐ లక్ష్మణ్‌ను వివరణ కోరగా పెద్ద మనుషులు తనను బెదిరిస్తున్నారని, తనకు సహాయం చేయాలని రాములు తనకు ఫిర్యాదు చేశాడన్నారు. నాలుగు సంవత్సరాలుగా కోర్టులో కేసు నడుస్తుండగా తాను అందులో జోక్యం చేసుకోలేనని రాములుకు నచ్చజెప్పానే తప్ప ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని తెలిపారు.

కాల్వ నర్సయ్య ఆశయ సాధనకు ఉద్యమిద్దాం


చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

భగత్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక నేత కాల్వ నర్సయ్య యాదవ్ ఆశయ సాధనకు ఉద్యమించాలని సీపీఐ నాయకులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అన్నారు. ఆదివారం కార్మిక నేత ప్రజా ఉద్యమాల నాయకుడు కాల్వ నర్సయ్య ఆరో వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వ నరసయ్య యాదవ్ కార్మికుల కోసం జీవితాన్ని అంకితం చేశారన్నారు. కాల్వ నర్సయ్య యాదవ్ ఆశించిన ఆశయాల కోసం ప్రతి ఒక్క కమ్యూనిస్టు కార్యకర్త పని చేయాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జంగా తిరుపతి యాదవ్, జంగ కొమురయ్య యాదవ్ దానవేణి రమేష్ యాదవ్ గామినేని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



- నాలుగేళ్లుగా ఎదురుచూపులు
- ప్రభుత్వం స్పందించాలంటున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

ఇళ్ల పట్టాలు ఇచ్చేదెన్నడో?

మల్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): డబుల్‌బెడ్ రూం ఇళ్ల అందించిన అధికారులు వాటికి సంబంధించిన పట్టాలు అందించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల మండలం నూకపల్లి, పోతారం, రామన్నపేట గ్రామంలో ఇళ్ల లేని నిరుపేదల కోసం నూకపల్లి శివారులో గత ప్రభుత్వ హయాంలో 65 మందికి డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మించారు. ఆ ఇళ్లను 2021 అక్టోబరు 14న అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు ఇళ్ల అందజేశారు. అప్పటి నుంచి ఇళ్లకు పట్టాలు లేక ఇంటి నంబర్లు కేటాయించడం లేదు. దీంతో 65 ఇళ్లకు సంబంధించి సీరియల్ నంబర్లపైనే ఇంటి పన్నులు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నాలుగు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇంటి పట్టాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పలు సౌకర్యాలు అందుకో లేకపోతున్నామని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇంటి పట్టాలు ఇస్తే వాటి ద్వారా ఇంటి పన్నులు చెల్లించడం, ఇతరత్రా సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

● పట్టాలు ఇవ్వాలి



స్వప్న, లబ్ధిదారు

ఇళ్ల అందించి నాలుగు సంవత్సరాలు అవుతున్నప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదు. దీంతో తాము నష్టపోవాల్సి వస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోవడంలేదు. వెంటనే తమకు అందించిన ఇళ్లకు పట్టాలు అందించాలి.

● ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం



కాసారపు పద్మ, లబ్ధిదారు

ఇంటి నంబర్లు లేకున్నా మాకు కేటాయించిన ఇళ్ల సీరియల్ నంబర్ ఆధారంగా ఇంటిపన్నులు చెల్లించాల్సి వస్తోంది. తమకు పట్టాలు ఇప్పించి ఇళ్లకు నంబర్లు కేటాయించాలి.

వైభవంగా బోనాల ఉత్సవాలు



చిన్న మెట్‌పల్లిలో బోనాల శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

హుజూరాబాద్/జమ్మికుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల జిల్లాలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. హుజూరాబాద్ పట్టణంలోని యాదవ్ నగర్ నుంచి గొల్ల కురుమలు, జమ్మికుంట పట్టణంలోని అబాది జమ్మికుంటలో కురమ, గొల్లలు బీరప్ప బోనాలను వైభవంగా నిర్వహించారు. పురవీధులు గుండా, డప్పు చప్పుళ్లతో బీరప్ప దేవాలయం చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు బాగుండేలా మమ్మల్ని చల్లగా చూడాలని దేవుడిని వేడుకుంటామని కులపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కులస్థులు, పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం మహాలక్ష్మీ దేవతకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర గ్రామం నుంచి గ్రామ శివారులోని మహాలక్ష్మీ దేవాలయం వరకు జరిగింది. అనంతరం మహాలక్ష్మీ దేవతకు మహిళలలు బోనాలను సమర్పించగా పోతరాజులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో వనభోజనాలు జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో ఆదివారం పోచమ్మ బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామశివారులో కొలువైన అమ్మవారి సన్నిధిలో గ్రామస్థులు ఉదయం నుంచి పూజలు చేశారు. ఇంటికొకరు చొప్పున మహిళలు బోనాలు తీసి పుర వీధుల వెంట డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో నైవేద్యం సమర్పించారు. పోతురాజులు చేసిన విన్యాసాలు అఆద్యంతం ఆకట్టుకున్నాయి. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. బోనాలు చూసేందుకు దుంపెట, భూషణరావుపేట గ్రామాల నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైర హేమలతమల్లేశ్, మహేశ్, నర్సారెడ్డి, గంగారెడ్డి, వివిధ కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 6,090 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు కొనసాగింది. డ్యామ్‌లోకి 6,090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 18.443 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 11.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 654 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.590 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.934 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

గంగనాల ఆయకట్టు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి గ్రామం గోదావరి నది తీరంపై ఉన్న గంగనాల ఆయకట్టు నీటిని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. అంతకు ముందు గోదావరి నదికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆయకట్టు కింద మండలంలోని వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలంలోని నడికుట, మొగిలిపేట్, ఓబులాపూర్, సంగం శ్రీరాంపూర్, దామరాజ్‌పల్లి గ్రామాల్లో సుమారుగా నాలుగువేల ఎకరాలకు తాగునీరు అందుతుందని వివరించారు. రైతులు రెండు పంటలు సాగు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మల గంగన్న, యామాపూర్ పీఏసీఎస్ చైర్మన్ అంకతి రాజన్న, నాయకులు దేశెట్టి రాజారెడ్డి, నాంపల్లి వెంకటాద్రి, బుర్రిముత్యం, అశోక్, కళ్ళెడ నరేందర్ తోకల సత్తయ్య పాల్గొన్నారు.



నైవేద్యంపై దాటుతున్న పశువులు (ఫైల్)



మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు (ఫైల్)

తండాల్లో 'శీత్లాభవాని' సందడి

- పశువుల క్షేమం కోసం గిరిజనుల పూజలు
- అమ్మ అనుగ్రహంతో రోగాలు తొలగుతాయని నమ్మకం
- రేపు తండాల్లో వేడుకలు

రుద్రంగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : లంబాడీల ఆరాధ్యదైవం శీత్లాదేవి. ఆషాఢం వచ్చిందంటే గిరిజన తండాల్లో పండగ వాతవరణంతో సందడి నెలకొంటుంది. తండా పెద్దమనిషి అనుమతితో ఆషాఢంలో ఒక మంగళవారాన్ని ఈ పండుగ జరుపుకోవడానికి కేటాయిస్తారు. ఈ పండుగ చేయడం ద్వారా దేవి అనుగ్రహిస్తే పశుసంపద అభివృద్ధితో పాటు ప్రజలకు వ్యాధులు రావని లంబాడీల నమ్మకం. తెలంగాణలో పోచమ్మ బోనాల పండుగా మాదిరిగానే గిరిజనులు శీత్లాభవాని వేడుకలు జరుపుకుంటారు. గతంలో గిరిజనుల జీవన ఆధారం పశు సంపద. గిరిజనులు నిత్యం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి పశుసంపదన ఉపయోగించుకునేవారు. పశుసంపద అభివృద్ధి కోసం గిరిజనులు శీత్లా భవాని దేవిని పూజిస్తారు. రుద్రంగి మండలం చుట్టూ ఉన్న గిరిజన తండాల్లో మంగళవారం శీత్లాభవాని పండుగను ఘనంగా నిర్వహిం చేందుకు ముస్తాబు చేస్తున్నారు. లంబాడీలు ఆషాఢ మాసంలో తండా పెద్ద మనుషుల అనుమతితో ఈ పండగను నిర్వహిస్తారు. గతంలో ఈ పండుగను కేవలం పశువులు ఉన్నవారే చేసేవారు. కానీ ఇప్పుడు అన్ని తండాల్లో గిరిజనులు నిర్వహించుకుంటున్నారు.

● ఆకట్టుకునే పూజా విధానం

పెద్ద పుష్యమి కార్తెలో శీత్లా మాతకు పూజిస్తారు. తండాలోని ఇళ్లలో కాకుండా దగ్గరలో ఉండే ఓ ఖాళీ ప్రదేశంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పొడవాటి రాళ్లతో తయారుచేసిన ప్రతిమలను ఏడుగురు భవానీలను వరుసలో తూర్పు దిక్కున ప్రతిష్టిస్తారు. భవానీల ప్రతిమలకు ఎదురుగా కొద్ది దూరంలో లుంకాడియా ప్రతిమను భవానీల వైపు చూసేలా నెలకొల్పుతారు.

● యువతులతో నైవేద్యం..



నైవేద్యం తీసుకొచ్చిన యువతులు(ఫైల్)

శీత్లా భవాని ప్రతిమలకు జాజు పూసి పువ్వులు, మామిడి ఆకులతో అలంకరిస్తారు. ఒక్కరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలు కలిపి తయారుచేసిన గుగ్రిని తెల్లవారు జరిగే శీత్లా పండుగకు నైవేద్యంగా తీసుకెళ్తారు. దీనినే వాంసీడొ నైవేద్యాన్ని యువతులు శీత్లా భవాని అమ్మవారికి సమర్పిస్తారు. శీత్లా భవాని మాతకు ఇళ్ల నుంచి తీసుకువచ్చిన పాయసం పూజలో ఉంచుతారు. వాంసీడొ నైవేధ్యాన్ని అన్ని పశువులపై పడేలా చల్లుతారు. దీని వల్ల పశుసంపద పెరుగుతుందని, పశువులకు ఎలాంటి వ్యాధులు రావని వారి నమ్మకం.

తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపిక

- ఈ నెల 12న మహానంది అవార్డుల ప్రదానం



మల్లేశం, సంతోష్‌చారి

గంభీరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపే ట మండలంలో ఒకరు సేంద్రియ వ్యవసాయంలో, మరొకరు శిల్పకళలో రాణి స్తూ తెలుగు వెలుగు జాతీ య పురస్కారానికి ఎంపిక య్యారు. వీరిద్దరి నైపుణ్యా లను గుర్తించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ మహానంది అవార్డుకు ఎంపిక చేసింది. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం అనే యువ రైతు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. ఐదేళ్లుగా ఆధునిక పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయ రంగంలో రాణిస్తు అందరి మన్ననలు పొందుతున్నాడు. దాదాపు 20 రకాల కూరగాయలను సాగు చేయడంతో పాటు జామ తోట పంటను పండించాడు. మండల కేంద్రానికి చెందిన వడ్రంగి చేపూరి సంతోష్‌చారీ అనే యువకుడు శిల్పకళా రంగంలో రాణిస్తున్నాడు. వండ్రంగి సంతోష్‌చారి తన కళా నైపుణ్యంతో మహనీయుల చిత్రాలు చెక్కాడు. బాబాసాహెబ్ అంబేడ్కర్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రాలతో పాటు అనేక రకాల వస్తువులను తన శిల్పకళతో చెక్కి సంతోష్‌చారి వార్తల్లోకి ఎక్కాడు. కాళోజీ తెలుగు బక్ ఆఫ్ రికార్డ్సు, తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 12న హైదరాబాద్ త్యాగరాయ గాన సభ వేదికలో వీరిద్దరికి మహానంది పురస్కారం ప్రదానం చేయనున్నారు. వీరిద్దరు నంది అవార్డుకు ఎంపిక కావడం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల సందడి

- తొలి ఏకాదశి సందర్భంగా తరలివచ్చిన భక్తజనం
- స్వామివారికి ప్రత్యేక పూజలు, అఖండ భజన

వేములవాడ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించకుని ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.

● తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు..

రాజన్న ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి, పరివార దేవతలకు అభిషేకపూజ, అర్చనలు చేశారు. రుక్మిణి విఠలేశ్వర స్వామివారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం నిర్వహించి సాయంత్రం మహాపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత పూజ వరకు అర్చకులు, భక్తులు అఖండ పూజలో పాల్గొన్నారు.

● స్వామివారి సేవలో ప్రభుత్వ విప్..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఏఈవో శ్రీనివాస్ ప్రసాదాన్ని అందజేశారు.

ధర్మపురిలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు లక్ష్మీ నరసింహస్వామి, వేంకటేశ్వర స్వామి వారలకు అభిషేకం, పంచోపనిషత్తులతో మహా క్షీరాభిషేకం, తులసీ అర్చన, విశేష పూజా, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యాగశాల వద్ద నారసింహ హవనం, స్వామి వారల నిత్య కల్యాణం నిర్వహించారు. భక్తులు ఉదయంనుంచి రాత్రి వరకు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, నంబి శ్రీనివాసాచారి, నరసింహమూర్తి, రమణాచార్యా, అభిషేక్ పౌరోహితులు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.





రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, ధర్మపురిలో యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

● గోదావరి నదిలో పుణ్య స్నానాలు

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ధర్మపురి గోదావరి నదిలో ఆదివారం భక్తులు స్నానాలు ఆచరించారు. ఉదయం భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నది వద్ద సైకత లింగాలు చేసి పసుపు, కుంకుమ చల్లి, కొబ్బెరికాయలు కొట్టి పూజించారు.

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వదించగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్ర, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆయన స్థానిక రామలింగేశ్వర స్వామి, గణపతి, రావి చెట్టు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తల మండలి సభ్యులు ఉన్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

సీసీ రోడ్డు నిర్మాణం.. విద్యార్థులకు తప్పిన తిప్పలు

కోనరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా సీసీ, తారు రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండడంతో రెండు జిల్లాల వాసులకు కష్టాలు తప్పాయి. ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరగడంతో విద్యార్థులకు, అధ్యాపకులకు, ప్రజాప్రతినిధులకు తిప్పలు తప్పాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల నుంచి నిజామాబాద్ జిల్లాలను కలిపే ప్రధాన రహదారి రోడ్డు పనులు మరిమడ్ల నుంచి మానాల వరకు చురుగ్గా కొనసాగుతున్నాయి. దీంతో రెండు జిల్లాల వాసులకు కష్టాలు తప్పాయి. మరిమడ్ల గ్రామ శివారులో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలకు గతంలో గుంతలు, బురదమయంగా రహదారి ఉండేది. అటుగా వెళ్లాలంటే విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భయంగా వెళ్లేవారు. మరిమడ్ల నుంచి మానాల వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల ప్రధాన రహదారికి ఆరు కోట్ల రూపాయలను ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మరిమడ్ల శివారులో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల సుమారు ఒక కిలోమీటర్‌నర ఉంటుంది. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో విద్యార్థులకు కష్టాలు తప్పాయి. మరిమడ్ల శివారు నుంచి ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల పక్కనుంచి మానాల వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. తారు రోడ్డు నిర్మాణంతో రెండు జిల్లాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





గతంలో బురదమయంగా మారిన మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాల రహదారి, నిర్మాణం అవుతున్న సీసీ రోడ్డు

భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేద పండితుడికి ప్రశంస పత్రాలను అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని, హైందవ సంస్కృతిలోని వేదాలను ప్రపంచంలోని పలు దేశాలు ఆచరిస్తున్నాయని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సులో భాగంగా నిర్వహించిన చతుర్వేద స్మార్త పరీక్షల్లో ఉత్తీర్ణులైన వేదపండిత విద్యార్థులకు ఆదివారం పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా వేద పండిత విద్యార్థులకు నిర్వహించే చతుర్వేద స్మార్త పరీక్షలు వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించడం గర్వకారణమని, అభినందనీయమని కొనియాడారు. హైందవ సంస్కృతిలోని వేదాలను ఇతర దేశాల వారు ఆచరిస్తున్నారని, దేవాలయాలకు రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోందని అన్నారు. రానున్న రోజుల్లో వేద పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య మరింతగా పెరుగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం వేద పండితులకు ఎల్లప్పు డు అండగా ఉంటుందని గుర్తు చేశారు. మన పూర్వీకులు తాలపత్ర గ్రంథాల ద్వారా వేదాలను మనకు అందించారని వివరించారు. గతంలో వేములవాడ రాజన్న ఆలయ చైర్మన్‌గా అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రాజన్న ఆలయ విస్తరణ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాని, నాలుగుసార్లు శృంగేరి వెళ్లి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులపై పీఠాధిపతులతో చర్చించి ముందుకు వెళుతున్నామన్నారు. రూ. 47 కోట్లతో రోడ్డు వెడల్పు, రూ. 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రూ. 150 కోట్లు రాజన్న ఆలయ అభివృద్ధికి కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. రోడ్డు వెడల్పులో నిర్వాసితుల త్యాగం ఎప్పటికి మరువలేనిదన్నారు. భూనిర్వాసితుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆలోచనలు చేస్తోందని తెలిపారు. వేద పండితులుగా పట్టాలు పొందుతున్న వేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పరీక్షాధికారులుగా వ్యవహరించిన వేద పండితులను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాభాయి ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు తదితరులు ఉన్నారు.

- కంచు షార్ట్ ఫిలింకు ఆరు సీఐఎఫ్ఏ అవార్డులు
- దర్శకత్వంలో రాణిస్తున్న సంతోష్ నారాయణన్



బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నుంచి.. సినీ దర్శకుడి వరకు



కెమెరాతో సంతోష్ నారాయణన్

వేములవాడ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సినిమాలపై ఉన్న మక్కువతో ఓ యువకుడు షార్ట్‌ఫిలింస్, వెబ్‌సీరిస్‌లు రూపొందిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు. పలు అవార్డులను కైవసం చేసుకున్నాడు. వెండితెరపై తన పేరును చూసుకోవాలని ఆరాటంతో మొదలైన అతడి ప్రయాణం విజయ పథంలో సాగిపోతున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ గ్రామీణ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోష్ నారాయణన్..

వరంగల్ జిల్లాకు చెందిన నారాయణ-వీరమ్మ దంపతుల పెద్ద కుమారుడు సంతోష్ నారాయణన్ చిన్న తనం నుంచి సినిమాలు చూస్తూ వాటిపైన ఎంతో మక్కువను పెంచుకున్నాడు. చిన్నప్పటి నుంచి చదువులో టాపర్‌గా నిలిచిన నారాయణ్ సినిమాలపై ఉన్న ఆసక్తితో 2017వ సంవత్సరంలో అవకాశాల కోసం అన్వేషణ ప్రారంభించాడు. 'కనబడుటలేదు' 'ఆచూకీ' చిత్రాల డైరెక్టర్ బాలరాజు వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చింది. రెండు సంవత్సరాల పాటు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూనే షూటింగ్‌లు లేని సమయంలో బ్యాంకు ఎగ్జామ్స్‌కు చదువుతూ ఒకేసారి 5 సెంట్రల్ గవర్నమెంట్ జాబ్స్ వచ్చాయి. సినిమాలపై ఉన్న ఆసక్తితో ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకుని సినిమాల వైపే మొగ్గు చూపాడు. అయితే 2020ల ఎదురైన ఆర్థిక ఇబ్బందులతో బ్యాంకు ఉద్యోగంలో చేరాడు.

● 'కంచు'తో అవార్డుల పంట పండింది..

సంతోష్ నారాయణన్ సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా వెబ్‌సిరీస్ 'కంచు' తీశాడు. మహిళా సాధికారతకు సంబంధించిన కథనం కావడంతో ప్రేక్షకులకు చేరువైంది. ఈ వెబ్ సిరీస్‌కు కొచ్చిన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ అవార్డులు ఆరింటిని కైవసం చేసుకుంది. అంతే కాకుండా లండన్ లిఫ్ట్ ఆఫ్ సెషన్ అవార్డు, బ్రిటన్ ఫస్ట్ టైమ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డు, 2021 సంవత్సరం ముంబైలో నిర్వహించిన ఎన్ఏడబ్ల్యూఏడీఏ ఇంటర్ నేషనల్ ఫిల్మ్ అవార్డుల్లో చోటు దక్కించుకుంది. ప్రస్తుతం మూడు వెబ్ సిరీస్‌లు, రెండు సినిమాలకు డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు.



నటులకు సూచనలు ఇస్తున్న సంతోష్ నారాయణన్

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


మెట్‌పల్లిలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి


ధర్మపురిలో నివాళులర్పిస్తున్న నాయకులు


ముత్తునూర్‌లో ..

మెట్‌పల్లిటౌన్, జూలై6(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను జరిపారు. ఈ సందర్భంగా నాయకులు పూలమాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సుకెంటి విజయ్, కుడుకల రఘు, బిజెపి నాయకులు తోకల సత్యనారయణ, కొల్లపు శ్రీనివాస్, సత్యనారయణగౌడ్, సౌజన్య, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో, మండలంలోని కమలాపూర్ గ్రామంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ విగ్రహం వద్ద, కమలాపూర్ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఒక మంచి జాతీయవాది, న్యాయవాది, అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టి తన ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి అంటూ కొనియాడారు. కాశ్మీర్ కోసం అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, గాజు భాస్కర్, ప్రధాన కార్యదర్శులు కామెర ప్రభాకర్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, బెజ్జారపు లవణ్, నాయకులు మాధవ్, గుండయ్య, శ్యామ్‌సుందర్, రవి, ప్రణీత్, మదుసూధన్, శ్రీధర్, నవీన్, శివసాయి, హరీష్, రాజు, నర్సయ్య, జెల్ల వినోద్, ఉయ్యాల వెంకటేష్, మహేష్, అనిల్, సాయికుమార్, శివకృష్ణ, గణేష్, మహేష్, మనోజ్, శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండలంలోని ముత్తునూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడుగోపతి జనార్ధన్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 11 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భూమేష్, శ్రీనివాస్, కిరణ్, నిఖిల్, సత్తన్న, తిరుపతి, రాకేష్‌చక్రపాణి, మహేష్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

●**మల్యాల:** జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను మల్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నిర్వహించారు. గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, జనగాం రాములు, సంగని రవి, కట్కం లత, రుత్త కిషన్, డబ్బు గోవర్ధన్‌రెడ్డి, బండారి రాజు, నల్ల జీవన్‌రెడ్డి, హర్షవర్ధన్, ప్రభాకర్, స్వామి, డానియల్, దేవరాజ్, ఆనందం, మధు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండల కేంద్రంలో ఆదివారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలిలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగుల కొమురెల్లి, రవీందర్ రెడ్డి, కొత్తూరి బాబు, అంజన్న, నరేందర్, కిషోర్ తదితరలు పాల్గొన్నారు.


పెగడపల్లిలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళి

పంటల రుణ పరిమితి పెంపు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ఆదేశించింది. అయితే క్షేత్ర స్థాయి లో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పాత రుణాన్ని రెన్యూవల్ చేస్తున్నట్లు చేసే బ్యాంకర్లు రుణ పరిమితి ఆధారంగా పెంచిన మొత్తాన్ని రైతుల చేతికి ఇచ్చి మిగతా మొత్తం పాత బకాయిగా సర్దుబాటు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

-భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



ప్రభుత్వం పెంచిన రుణ పరిమితిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. బ్యాంకర్లు రైతులకు విరివిగా పంట రుణాలు అందించాలి. పెంచిన రుణ పరిమితి ఆధారంగా రుణాలు పంపిణీ చేయాలి. బ్యాంకర్లు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలి.

జగిత్యాల ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్యమంత్రిని కలువగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

●జగిత్యాల: ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్‌కు ఆదివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

●**జగిత్యాల క్రైం/అర్బన్:** జగిత్యాలలో భక్త మార్కండేయ, శ్రీ రామచంద్ర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ఎఫ్‌సీజీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వాల్మీకి ఆవాసం, గాయత్రి విశ్వకర్మ అనాధ ఆశ్రమంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల జిల్లా, రోటరీ క్లబ్, ఆపీ ప్రివెంటివ్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో గీతా భవన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, నాయకులు శ్రీనివాస్, జగన్, సత్యం, పద్మశాలి సంఘం అధ్యక్షులు బోగ గంగాధర్, తాటిపాముల వినోద్, క్యాదాసు నాగయ్య, కొక్కుల ప్రభాకర్, బద్దం జగన్ మోహన్ రెడ్డి కస్తూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు కోల శ్రీనివాస్, కొండపెల్లి రవీందర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్ర రమాదేవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజరెడ్డి పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలో దూలూరి ప్రసాద్ నిర్వహిస్తున్న పార్థన గృహము(చర్చి)లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాయికల్ మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాస్టర్ దూలూరి ప్రసాద్ పాల్గొన్నారు.

●రాయికల్ మండల ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఇటిక్యాల గ్రామంలో నివేదిత వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు చెలిమెల మల్లేశం, ప్రధాన కార్యదర్శి రొట్టె శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**బీర్‌పూర్:** మండలకేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నారపాక రమేష్, పర్వతం రమేష్, ఆడెపు రవికుమార్, ఎనుగుమట్ల హరీష్, శీలం రమేష్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి

కొడిమ్యాల, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. వారు బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల నాయకులు, రాష్ట్ర కార్యదర్శి కొత్తూరి స్వామి, మండల అధ్యక్షుడు ఎలగుర్తి రవీందర్, పర్లపల్లి ప్రసాద్, మహేష్, రాకేష్, మల్లేశం, అంజన్‌కుమార్, శ్రీనివాస్, శంకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

మల్లాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని మారుమూల గ్రామానికి చెందిన వడ్లకొండ రమేష్-జమున కూతురు వడ్లకొండ వాహిని ఆదివారం విడుదలయిన సీఏ (చార్టెడ్ అకౌంట్)లో ఉత్తీర్ణత సాధించిందని పూర్వ విద్యార్థిని కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ అనిల్‌సింగ్ పుష్పగుచ్ఛం అందించారు. శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థి సీఏలో ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

-ఇళ్ల మీద వేలాడుతున్న ఎల్‌టీ విద్యుత్ తీగలు -పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

గొల్లపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం రంగదాముని పల్లె గ్రామంలో ఇళ్ల మీద విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదభరితంగా మారాయి. దీంతో కాలనీ వాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఆ కాలనీ వాసులకు శాపంగా మారింది. సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని వేవులవాడ చంద్రయ్య అనే వ్యక్తి ఇంటి పక్కనే విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వర్షం పడ్డప్పుడల్లా, గాలిదుమారం వీచినప్పుడలా కాలనీ వాసులు ప్రాణ భయంతో బయటికి పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీలో పలు ఇళ్ల మీద నుంచి విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో కాలనీవాసులు అంతా భయాందోళన చెందుతున్న పట్టించుకున్న నాథులు కరువయ్యారని వాపోతున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బాధితుడు చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. అసలే వర్షకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా సంభవిస్తుంటే నివాస స్థలాల్లో విద్యుత్ తీగలు ఇలా వేలాడుతూ ప్రమాదభరితంగా మారితే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి ప్రమాదాన్ని నివారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


ఇంటి మీద వేలాడుతున్న విద్యుత్ తీగలు

అధికారులు స్పందించాలి

-చంద్రయ్య, రంగదాముని పల్లె



ఎంతో కాలంగా నా ఇంటి మీద నుంచి కరెంట్ తీగలు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నాం. వర్షం పడ్డప్పుడల్లా ఇవతలికి వస్తున్నాం. విద్యుత్ అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకుంట లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

తక్షణమే చర్యలు చేపడతాం..

-మధు, ట్రాన్స్‌కో ఏఈ

ఇళ్ల మీద విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా ఉన్న సంగతి తన దృష్టికి ఇప్పుడే వచ్చింది. తప్పనిసరిగా సంఘటనాస్థలిని పరిశీలించి తక్షణమే మరమ్మతు చర్యలు చేపడతాం. విద్యుత్ ప్రమాదాలను నివారిస్తాం. ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతాం. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ ప్రమాదాలను నివారించడమే లక్ష్యం.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


కోనాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొడిమ్యాల, జూలై6(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం కోనాపూర్ గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేసినందుకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ రైతులు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయులు మాట్లాడుతూ తాము గత పాలకులకు వారికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరిన ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. 15 ఏళ్ళుగా తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తీర్చాలిని కోరినప్పటికి ఎవ్వరు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు వినతిపత్రం అందించగానే విద్యుత్ సబ్ సేషన్ మంజూరు చేసిరందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. కోనాపూర్ గ్రామ రైతుల సంక్షేమం కోరి విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి 33బై11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు దూమాల నర్సయ్య, తోకల శ్రావణ్, రాజు, రవి, ఆదిరెడ్డి, విజయ్, అంజయ్య, సంతోష్, తిరుపతి, దుర్గయ్య, జలపతిరెడ్డి, శ్రీనివాస్, రాజయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ జూనోసిస్ డే

ధర్మపురి, జూలై 6: ధర్మపురి పట్టణంలోని వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో మున్సిపల్ సహకారంతో వెటర్నరీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బోనగిరి నరేష్, ధర్మపురి మండల వెటర్నరీ డాక్టర్ దుంపల వేణుగోపాల్ జంతువులు, మనుషుల మధ్య సంక్రమించే వ్యాధులు (జూనోటిక్) గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జూలై 6న లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త యాంటీ రేబిస్ టీకాను ఒక మనిషికి విజయవంతంగా ప్రయోగించిన రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ప్రమాదకరమైన రేబిస్ వ్యాధి రాకుండా 58 పెంపుడు కుక్కలకు వెటర్నరీ శాఖ పక్షాన ఉచితంగా యాంట రేబీస్ టీకాలు వేయడం జరిగిందని వివరించారు. అనంతరం లయన్స్ క్లబ్ పక్షాన అధ్యక్షులు మామిడాల రవీందర్ ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బోనగిరి నరేష్, డాక్టర్ దుంపల వేణుగోపాల్, సిబ్బందిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. చివరగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు మామిడాల రవీందర్, సెక్రటరీ సర్వారావు, కోశాధికారి పప్పుల శ్రీనివాస్, జోనల్ చైర్‌పర్సన్ పిన్న శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ఒజ్జల మోహన్, రంగ హరినాథ్, కట్ట శ్రీహరి, క్లబ్ ఎల్‌సీఎఫ్ రాపర్తి నర్సయ్య, ఎడ్యుకేషనల్ కో ఆర్డినేటర్ గట్ల శ్రీనివాస్, సభ్యులు అప్పాల లింగన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

కోరుట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని వేంకటేశ్వర, అష్టలక్ష్మి, మహాదేవ స్వామి, నగేశ్వర, కోటి నవదుర్గ దేవాలయాలతో పాటు పలుదేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయాలలో పురోహితులు ప్రత్యేక పూజలు అర్చన అభిషేక కార్యక్రమాలను జరుపగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎతిరాజం నర్సయ్యలతో పాటు పలు దేవాలయాల నిర్వహకులు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అల్లీపూర్, భూపతిపూర్, మూటపెల్లి, కొత్తపేట, ఇటిక్యాల తదితర గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహిళలు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు.

కార్యక్రమంలో పురోహితులు గురులింగం విక్రమ్, సుధీర్, విజయ్, మాజీ సర్పంచ్ బాలె శోభారాణి, మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వాల్గొండ రామలింగేశ్వరాలయం, మొగిలిపేట మహాదేవాలయం, శ్రీలక్ష్మి వెంకటేశ్వరాలయం, సిర్పూర్, కుస్థాపూర్, శ్రీసీతా రామాలయం తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుండే భక్తులు గంగనదిలో పవిత్ర స్నానములు గావించి ఆలయాలకు వెళ్లి విశేషా పూజలు జరిపారు. వాల్గొండ రామలింగేశ్వరలయంలో చతుర్మాసా దీపం వెలిగించారు. శయన ఏకాదశి నుండి నాలుగు నెలల వరకు అనగా కార్తీక ఏకాదశి, పౌర్ణమి వరకు ప్రతి యేటా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.


వాల్గొండ రామలింగేశ్వరాలయంలో భక్తుల పూజలు

●**కొడిమ్యాల:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ప్రజలు తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆంజనేయ స్వామి, మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహ స్వామి, పూడూర్ వెంకటేశ్వర స్వామి, బ్రహ్మంగారి ఆలయం, మార్కెండేయ స్వామి, సాయిబాబా ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయమే తలంటు స్నానాలు ఆచరించి, గుమ్మాలకు మామిడి తోరణాలు అలంకరించారు.

ఇళ్లలో శ్రీ మహావిష్ణువు చిత్రపటాలను అందంగా అలంకరించి దూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తితో స్వామి వారిని కొలిచారు. కోటిలింగాల గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో దేవాలయాలకు వెళ్లి స్వామి వారిని పూజించారు.

గుంతలమయంగా రహదారి

-ప్రమాదాల పాలవుతున్న ప్రయాణికులు-పట్టించుకోని అధికారులు


నల్లగొండ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కొడిమ్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామ రహదారిపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నల్లగొండ గ్రామ శివారులోని ఎత్తైన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం సమీపంలో బస్‌స్టాప్ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు సైడ్ బర్మ్ కొట్టుకుపోవటంతో స్వామి వారి దర్శనానికి వచ్చే పోయె భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి దర్శించుకున్న భక్తులు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం నల్లగొండ నుంచి రాక పోకలు సాగిస్తుంటారు. సైడ్ బర్మ్ కొట్టుకుపోయిన ప్రాంతంలో, రోడ్డుపై గుంతలు ఏర్పడిన ప్రదేశాల్లో పలుమార్లు వానాలు వేగంగా వచ్చి ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. రేయింబవళ్ళు వందలాది వాహనాలు నడుస్తున్న ఆలయం సమీపంలో రోడ్డు సైడ్ బర్మ్ కొట్టుకుపోయిన, నడి రోడ్డుపై గుంతలు ఏర్పడిన చోట మరమ్మతు చేయకపోవటం ఆందోళనకరమని నల్లగొండ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు గుంతలను పూడ్చి వేసి, సైడ్ బర్మ్ మట్టితో నింపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారులు రోడ్డు మరమ్మతు చేయాలి

-శోభన్, నల్లగొండ గ్రామస్థుడు



రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదాలు జరుగకుండా నల్లగొండ బస్టాండ్ సమీపంలో ఏర్పడిన గుంతను సంబంధిత అధికారులు మరమ్మతు చేయించాలి. ఆలయం సమీపంలో రోడ్డు సైడ్‌బర్మ్ మట్టితో నింపాలి.

రాజన్న ఆలయానికి ప్లేట్లు వితరణ

పెగడపల్లి , జులై 6 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి సింగరేణి ఉద్యోగి గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి 265 స్టీల్ ప్లేట్లు అందజేశారు. ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్న ప్రసాద వితరణకు గాను గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగి శ్రీనివాస్‌రెడ్డి రూ.30 వేలు వెచ్చించి ప్లేట్లు కొనుగోలు చేసి ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, అర్చకులు గుండి శ్రీనివాస్ శర్మ, కమిటీ సభ్యులు గంప వెంకటరమణ, పార్థసారథి, నర్సింహ రెడ్డి, రాంచంద్రం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పూల మొక్క అందించిన ఎస్‌ఐ రవీందర్

ధర్మపురి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం ధర్మపురి ఎస్ఐ 2 రవీందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ధర్మపురి ఎస్ఐ2 గా రవీందర్‌ను నియమించడంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎస్ఐ-2 రవీందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

ఇబ్రహీంపట్నం, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన లోక రమణారెడ్డిని మండల గౌడ సంఘం నాయకులు ఆదివారం తిమ్మాపూర్‌లోని తన నివాసంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు నేరెళ్ల సుభాష్ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు చెట్ల చంద్రశేఖర్ గౌడ్, గౌడ సంఘ నాయకులు కట్ట ఆంజనేయులు గౌడ్, మోత్కూరి సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.